

'టీం శివంగి' వివరాలను మంత్రి సీతక్కకు వెల్లడిస్తున్న ఎస్పీ (ఫైల్)

బాసర గోదావరి వద్ద ఆత్మహత్యల నిరోధానికి చర్యలు చేపడుతున్న పోలీసులు

దొంగల ముఠాను అరెస్ట్ చేసిన జిల్లా పోలీసులు (ఫైల్)

మత్తు దందాపై.. ఉక్కుపాదం

- జిల్లాలో సత్ఫలితాలిస్తున్న పోలీసు సంస్కరణలు
- ప్రజల కోసం 'పోలీసు ప్రజా దర్బార్' నిర్వహిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల
- నిరాటకంగా సోషల్ కాంటాక్ట్ కార్యక్రమాలు
- గంజాయి, డ్రగ్స్ దందాపై ఉక్కుపాదం
- దొంగతనాల కట్టడికి పకడ్బందీ చర్యలు
- బాసర గోదావరిపై ఆత్మహత్య నిరోధక బృందాలు
- సైబర్ నేరాల అడ్డుకట్టకు 'మాస్టర్ ప్లాన్'

నిర్మల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ జానకీ షర్మిల బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. గంజాయి, డ్రగ్స్ వంటి 'మత్తు దందా'పై ఉక్కుపాదం మోపుతున్నారు. పోలీసు శాఖను ప్రక్షాళన చేసి ఆ శాఖను జనానికి అత్యంత చేరువ చేస్తూ సోషల్ పోలీసింగ్ ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఎస్పీగా జానకీషర్మిల బాధ్యతలు స్వీకరించిన నాడు జిల్లాలో రాజకీయ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అయితే ఛాలెంజింగ్‌గా జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జానకీ షర్మిల క్రమక్రమంగా తన శాఖలో ఒక్కో సంస్కరణను చేపడుతూ ఆ శాఖను ప్రజలకు అత్యంత చేరువ చేయడంలో సక్సెస్ అయ్యారు. అనేక క్లిష్టమైన కేసులను చేధిస్తూ, సంక్లిష్టమైన పరిస్థితులను అధిగమిస్తూ ఆమె బెస్ట్ పోలీసింగ్‌కు శ్రీకారం చుట్టారు. బాధ్యతలు స్వీకరించిన రోజుల్లో ఈ శాఖపై అనేక ఆరోపణలు ఉన్న విషయాన్ని జానకీషర్మిల పరిగణనలోకి తీసుకున్నారు. అందుకు భిన్నమైన పాలనను జిల్లాలో అమలు చేసి తన శాఖ ప్రతిష్ఠను రెట్టింపు చేయాలని ఆమె లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు అనుగుణంగానే సోషల్ పోలీసింగ్ అనే పరిపాలన ప్రక్రియను తెరపైకి తెచ్చారు. ఇందులో భాగంగానే ఆమె గతానికి భిన్నంగా 'పోలీస్ ప్రజా దర్బార్' అనే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు ప్రతిరోజూ తన కార్యాలయంలో అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకుంటుండడం విశేషం. గతంలో ప్రజల ఫిర్యాదులు పోలీసుస్టేషన్ వరకే పరిమితమయ్యేవి. ఆ విధానాన్ని పక్కన పెట్టి నేరుగా ప్రజలు తనను కలిసి సమస్యలు చెప్పుకునే వెసులుబాటును కల్పించారు. దీని కోసం గాను ప్రతీరోజూ తన కార్యాలయంలో పరిపాలన పరమైన విధులను కొనసాగిస్తూనే మరోవైపు ప్రజలు అందించే వినతులు, ఫిర్యాదులపై స్పందించి వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటుండడం విశేషంగా చెబుతున్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు యువతను పీడిస్తున్న గంజాయి, డ్రగ్స్ లాంటి వాటిని రూపుమాపేందుకు ఆమె ఉక్కుపాదం మోపుతున్నారు. అలాగే సాధారణ దొంగతనాలు, మోటార్ బైక్‌ల దొంగ తనాలపై ఆమె కొరఢా ఝులిపిస్తున్నారు. బిట్‌కాయిన్ వంటి కుంభకోణాన్ని వెలికితీసి రాష్ట్ర, జాతీయస్థాయిలో ఆమె ప్రశంసలు అందుకున్నారు. సోషల్ కాంట్రాక్ట్ పేరిట ప్రతిరోజూ ఏదో ఒక గ్రామంలో పోలీసులు, ప్రజలను ఒకే చోటికి చేర్చి వారు మమేకమయ్యేట్లు చూస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టేందుకు ఎస్పీ ఆ క్యాంపస్‌ను దత్తత తీసుకున్నారు. అలాగే బాసర గోదావరి నదిపై పెరిగిపోతున్న ఆత్మహత్యలను అరికట్టేందుకు ఆమె అక్కడి బ్రిడ్జిపై ప్రత్యేక పోలీస్ టీంలను నియమించి 24 గంటల పాటు నిఘాను కొనసాగింపజేస్తున్నారు.

జిల్లాలో పోలీసు శాఖ ప్రక్షాళన

గతంలో పోలీసు శాఖలోని కొంతమంది అధికారులు, పోలీసు సిబ్బందిపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పటి రాజకీయ నేతల అండదండలతో కొంతమంది పోలీసు అధికారులు, సిబ్బంది సెటిల్‌మెంట్‌లు చేయడం, రియల్ ఎస్టేట్ దందాలను కొనసాగించడం, బెదిరింపులకు పాల్పడడం, ప్రైవేటు పంచాయతీలు నిర్వహించడం లాంటి ఆరోపణలు వెల్లువెత్తాయి. రాజకీయ అండదండలున్న కారణంగా వీరు ఒకే చోట ఏళ్ల నుంచి పాతుకుపోయేవారు. వీరిపై ఆరోపణలునప్పటికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేందుకు వెనకాడేవారు. ఇలాంటి క్లిష్ట మైన పరిస్థితుల నేపథ్యంలో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే తనదైన మార్క్‌తో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. మొదట్లో తీవ్రమైన ఆరోపణలున్న వారందరినీ దూర ప్రాంతాలకు బదిలీ చేసి కొరఢా ఝుళిపించారు. ఆ తరువాత మిగతా వారిని కూడా బదిలీలు చేస్తూ పోలీసు శాఖను గాడిలో పెట్టే ప్రయత్నం చేశారు. పోలీసుల పనితీరుపై తనదైన శైలిలో ఇంటలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం సేకరిస్తూ వారి ప్రవర్తనలో మార్పు తెచ్చే ప్రయత్నం చేశారు. తప్పు చేసే సిబ్బందికి మొదట సీరియస్‌గా వార్నింగ్‌లు ఇస్తూ ఆ తరువాత చర్యలు తీసుకుంటున్నారు. ఒకే చోట ప్రభావం పడకుండా ఆమె జాగ్రత్తలు తీసుకొని పోలీసు సిబ్బంది బదిలీలు కొనసాగిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లను పక్కన పెట్టి క్లీన్‌చీట్ ఉన్న అధికారులకు, సిబ్బందికి మాత్రమే ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై మాత్రం ఎస్పీ మరింత సీరియస్‌గా స్పందిస్తున్నారు. ఎస్పీ చేపడుతున్న సంస్కరణల కారణంగా చాలా మంది సిబ్బంది తప్పు చేసేందుకు జంకుతున్నారన్న అభిప్రాయాలు ప్రజల్లో వ్యక్తమవుతోంది.

కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని కీలక అంశాలపై ఎస్పీ జానకీ షర్మిల ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇటు ప్రజల చేత అటు ప్రభుత్వం చేత మన్ననలు అందుకుంటున్నారు. సోషల్ పోలీసింగ్‌లో భాగంగా ఆమె ప్రజాదర్బార్, సోషల్ కాంటాక్ట్, గంజాయి, డ్రగ్స్ లాంటి వ్యసనాలపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు జరిపిన ఆందోళన సందర్భంగా ఎస్పీ నిర్వహించిన పాత్రపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ఆమె పనితీరును అభినందించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లకే పరిమితమై విధులు నిర్వహిస్తున్న మహిళ కానిస్టేబుళ్ళకు ఆమె ప్రత్యేక స్థానం కల్పించేందుకు పోలీసు అక్క పేరిట వారికి కీలక బాధ్యతలు అప్పగించారు. కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థులకు మనోధైర్యం పెంపొందించేందుకు ఆమె పోలీసు అక్కలో భాగంగా ప్రత్యేక సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. దీని కారణంగా విద్యార్థినులకు మనోధైర్యం పెంపొందుతోందని చెబుతున్నారు. బాసర ట్రిపుల్ ఐటీని దత్తత తీసుకొని అక్కడి విద్యార్థులతో కౌన్సిలింగ్‌లు నిర్వహించడమే కాకుండా వారికి కేరియర్ ప్రాధాన్యతను, మానసిక ఒత్తిడిని దూరం చేసే విధంగా ముఖాముఖి చర్చలు జరిపారు. దొంగతనాలపై ఎస్పీ కఠిన చర్యలు తీసుకుంటూ నిఘాను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. జిల్లాను ప్రస్తుతం గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ఎస్పీ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటివరకు గంజాయికి సంబంధించిన 67 కేసులు నమోదు చేశారు.

నిర్మల్ డిపోను ఉన్నతంగా నిలపాలి : రీజినల్ మేనేజర్



ఆర్ఎంను సన్మానిస్తున్న డిపో మేనేజర్ పండరి

నిర్మల్ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఆర్టీసీ డిపోను రాష్ట్రంలోనే ఉన్నతంగా నిలపాలని ఆదిలాబాద్ రీజినల్ నూతన మేనేజర్ భవాని ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన నిర్మల్ డిపోను సందర్శించారు. అన్ని విభాగాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. సంస్థ ఆర్థికాభివృద్ధి పాటుపడాలన్నారు. డిపో మేనేజర్ కే.పండరి ఆర్ఎంను శాలువాతో సన్మానించారు. సహ మేనేజర్ దేవపాల, ఏఈ నవీన్ కుమార్, టీఐ వీజీ రెడ్డి, ఎస్ఎం ఏఆర్ రెడ్డి ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో రామారావు

నిర్మల్ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని డీఈవో రామారావు ఆదేశించారు. మంగళవారం ఎంఈవోలు, సమన్వయకర్తలతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల ప్రారంభం నాటికి సిద్ధం కావాలని 6 నుంచి 19 వరకు బడిబాట నిర్వహించాలన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యాబోధన తదితర అంశాలు తల్లిదండ్రులకు తెలియజేసి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేలా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో విద్యారిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. అక్షరాస్యత పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు హాజరయ్యారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ చెక్కు అందజేసిన డీసీసీ అధ్యక్షుడు



మామడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కప్పన్‌పల్లి గ్రామానికి చెందిన బి. రాజేశ్వర్ అనే వ్యక్తి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందడంతో ఈ విషయం తెలుసుకున్న జిల్లా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆసుపత్రికి వెళ్లి రాజేశ్వర్‌ను పరామర్శించారు. ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2,50,000 ఎల్‌వోసీ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు, పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. చెక్కు అందజేసేందుకు కృషి చేసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీహరిరావుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు భైంసాలో ఫిర్యాదుల స్వీకరణ : ఎస్పీ

నిర్మల్ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : భైంసా పోలీస్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. భైంసా సబ్ డివిజన్ పరిధిలో ఫిర్యాదు దారులు తమ ఫిర్యాదులను నేరుగా సమర్పించవచ్చునని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్టు పేర్కొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

నిర్మల్ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జూన్ 1 నుంచి 30 వరకు పోలీస్ 30 చట్టం 1861 అమలు చేస్తున్నట్టు ఎస్పీ జానకీషర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం పోలీస్ అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ సభలు, ఊరేగింపు, ధర్నాలు జరపరాదని పేర్కొన్నారు. మారణాయుధాలు, పేలుడు పదార్థాలు, నేరపూరిత ఆయుధాలు కలిగి ఉండరాదన్నారు. జనం పోగవ్వడం, లౌడ్‌స్పీకర్లు, డీజేలు నిషేధమన్నారు. 1861 పోలీస్ యాక్ట్ 30 ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా శిక్షార్హులని తెలిపారు.

నాణ్యమైన విత్తనం.. లాభసాటి వ్యవసాయానికి సోపానం

- వ్యవసాయ శాస్త్రవేత్త వెంకట రాజ్‌కుమార్

దిలావర్‌పూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : లాభసాటి వ్యవసాయానికి నాణ్యమైన విత్తనమే కీలకమని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డా.వెంకట రాజ్‌కుమార్ అన్నారు. 'నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బన్సపల్లిలో ఎంపిక చేసిన రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పంటల సాగులో నాణ్యమైన విత్తనం పాత్రను గురించి ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలను సాగు చేసిన తర్వాత వచ్చే పంట వల్ల ఉత్పత్తి అయిన విత్తనాన్ని తోటి రైతులకు తక్కువ ధరకే అందజేయాలన్నారు. ఎంపిక చేసిన రైతులకు విత్తనోత్పత్తిపై ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారుల ద్వారా సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. రానున్న రెండు మూడు సంవత్సరాల్లో ప్రభుత్వం ప్రతి గ్రామాన విత్తన స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. విత్తన భద్రతలో దేశంలోని మిగతా రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలపాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన రైతులకు వరి, కంది, పెసర పంటల విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పూంద్రు వెంకటరమణరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సాయన్న, మండల వ్యవసాయశాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ఏఈవోలు రాజేశ్వర్‌రెడ్డి, శ్రావ్య, క్లస్టర్ రైతులు పాల్గొన్నారు.

సోన్‌లో విత్తనాల పంపిణీ

సోన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పంట సాగులో నాణ్యమైన విత్తనం పాత్ర గురించి జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం 'నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం' అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. వ్యవసాయ పరిశోధన స్థానం ఆదిలాబాద్ ప్రధాన శాస్త్రవేత్త డా. రామ్‌ప్రసాద్ రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ప్రతి పంటలో నాణ్యమైన విత్తనాన్ని వాడినప్పుడు దిగుబడులు కనీసం 10-15 శాతం వరకు పెరిగే అవకాశాన్నిరైతులకు తెలియజేయడం, రైతులు ఒకసారి నాణ్యమైన విత్తనాన్ని వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా సేకరించి, కొన్ని సాగు సాంకేతికతలను పాటిస్తే అదే విత్తనాన్ని 2-3 సంవత్సరాల వరకు వాడుకోవచ్చు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ఎంపికైన ముగ్గురి నుంచి ఐదుగురు రైతులకు వ్యవసాయ పరిశోధన స్థానాల ద్వారా ఉత్పత్తిచేసిన నాణ్యమైన విత్తనం అందిస్తారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వినోద్, ఏఈవో ఉమా, ప్రగతి, రైతులు సాయి, లింగన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలి

- పీసీసీ పరిశీలకులు ఎండీ అవేజ్, చంద్రశేఖర్ గౌడ్



మాట్లాడుతున్న ఎండీ అవేజ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

పెంబి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : బూతుస్థాయి నుంచి అసెంబ్లీ స్థాయి దాకా పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పీసీసీ పరిశీలకులు ఎండీ అవేజ్, చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం పెంబి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత, నిర్మాణ సన్నాహక సమావేశానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి హాజరై మండల కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు.

నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తాం : ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రతీ కార్యకర్త ధైర్యంగా ఉండాలని, కార్యకర్తల సంక్షేమం తన బాధ్యత అని భరోసా కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని గ్రామ గ్రామానికి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేసే దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. గత ప్రభుత్వం పాలనలో విఫలమైందని , కేసీఆర్‌ది నియంత పాలన అని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుందని, ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలను అందజేస్తామని, ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్‌రెడ్డి, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నసత్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగభూషణ్, నాయకులు తులాల శంకర్, తోటల మహేందర్, స్వామి, సంతోష్, టీకాజీ, అంబాజీ, ఆదిల్, పోశన్న, ఆయా గ్రామాల నుండి వచ్చిన ముఖ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

దస్తురాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట పొలాలు అధిక దిగుబడి సాధించాలంటే తప్పనిసరిగా జీలుగ, జనుము విత్తనాలను వేసుకోవాలని సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం వద్ద రైతులకు జీలుగ, జనుము విత్తనాలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి రైతు సేంద్రియ ఎరువులతో పాటు జీలుగ వేసుకున్నట్లయితే అధిక దిగుబడితో పాటు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చన్నారు. జీలుగ, జనుము భూ సారవంతానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగభూషణ్, సహకార సంఘం చైర్మన్ రామడుగు శైలజ, వ్యవసాయశాఖ ఏడీఏ సుజాత దస్తురాబాద్, రేవోజిపేట్ ఏఈవోలు తిరుపతి, కిరణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దుర్గం మల్లేష్, నాయకులు రమేష్ రావు, సింగరి కిషన్, నరేష్‌రెడ్డి, రాజేశం, శరత్ రెడ్డి, ఆనంద్, గోపి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

రాజకీయ పబ్బం గడుపుకోవడానికే ఎమ్మెల్యేపై బీజేపీ చౌకబారు ఆరోపణలు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దయానంద్

ఖానాపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికే బీజేపీ నాయకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌పై తమ అక్కసును వెల్లగక్కుతున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దయానంద్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఖానాపూర్ పట్టణానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ రాకుండా చేశారని బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన సదర్మాట్ బ్యారేజీని పక్క నియోజకవర్గానికి మళ్లించినది బీఆర్ఎస్ నాయకులన్న విషయం బీజేపీ నాయకులకు తెలవకపోవడం వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ పక్క నియోజకవర్గానికి తరలించిన సదర్మాట్ బ్యారేజీ నుండి నేరుగా పాత ఆనటకట్ట వరకు నీళ్లు చేరేలా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ముఖ్యమంత్రితో మాట్లాడి రూ. 3 కోట్లు మంజూరు చేయించారన్నారు. ఇక రెండోని వాగుపై రెండు వంతెనల నిర్మాణం విషయంలో బీజేపీ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఇక ఖానాపూర్‌లో రోడ్డు వెడల్పు ప్రక్రియను ఓ బీఆర్ఎస్ నాయకుడు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకొని అడ్డుకున్నారన్నారు. ఖానాపూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కృత నిశ్చయంతో ఉన్నారని ఇదివరకే స్థలాన్ని కూడా పరిశీలించారన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల తరలిపోతుందని ఆరోపిస్తున్న బీజేపీ నాయకులకు దమ్ముంటే ఎంపీ సహకారంతో ఖానాపూర్‌కు నవోదయ పాఠశాలను మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. ఖానాపూర్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యేపై బీజేపీ చౌకబారు ఆరోపణలు చేస్తుందని మండిపడ్డారు. ఇకనైనా ఇటువంటి ఆరోపణలు మానుకోవాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజూర సత్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగనర్సయ్య, మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షౌకత్ పాషా, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శెట్టి శ్యామ్‌మోహన్ రావు, మడిగెల గంగాధర్, జంగిలి శంకర్, పరిమి సురేష్, మదిరే సత్యనారాయణ, సార్ల నర్సయ్య, రాజేందర్, లక్ష్మీపతి గౌడ్, వెంకటప్పయ్య, పి. శ్రీనివాస్, ఎల్. రమేష్, శేషాద్రి, తదితరులున్నారు.

బాలికలకు కరాటే బెల్ట్ గ్రేడ్ పరీక్ష

నిర్మల్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఝాన్సీ లక్ష్మీబాయి ఉచిత కరాటే శిక్షణలో గత 30 రోజులుగా నేర్చుకున్న బాలికలు మంగళవారం కరాటే బెల్ట్ గ్రేడ్ ఎగ్జామ్ నిర్వహించినట్లు జపాన్ కరాటే అసోసియేషన్ అధ్యక్షులు తేజేంద్రసింగ్ బాటియా తెలిపారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 11 మంది బాలికలకు బెల్ట్, సర్టిఫికెట్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కొండాజి శ్రీకాంత్, అమ్ముల భూషణ్, కరాటే శిక్షకురాలు కిన్నెర్ల మృణాళిని, తదితరులు పాల్గొన్నారు.

లారీ, స్కూటీ ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

సారంగాపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల డాంగ్యాపూర్ గ్రామ సమీపంలో ఆదిలాబాద్ నిర్మల్ రహదారిపై మంగళవారం లారీ స్కూటీ ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు అయినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ నుండి ఆదిలాబాద్ వైపు వెళుతున్న టీ ఎస్ 01 యూ 2832 అనే నెంబరు గల లారీ స్కూటీని ఢీ కొనడంతో స్కూటి పై ఉన్న గుగ్లోత్ శశికాంత్, పాల్సిరామ్, శవంతభాయ్‌లకు తీవ్ర గాయలు కావడంతో చికిత్స నిమిత్తం నిర్మల్ పట్టణంలో గల ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

- ఒకరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాద దృశ్యం

నర్సాపూర్(జి), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సంజీవరెడ్డితోట వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ఓ ఘోర రోడ్డు ప్రమాదంలో లక్ష్మీనారాయణ అనే ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి చేతికి ఫ్రాక్చర్ అయ్యింది. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తీవ్రఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాసర మండలానికి చెందిన లక్ష్మీనారాయణ నిర్మల్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఊరచెరువు కట్ట వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన ఓ ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండానే కొచ్చేరు వైపు పరారయ్యాడు. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. ముఖ్యంగా అతని చేతికి ఫ్రాక్చర్ అయ్యింది. ఈ ప్రమాదానికి ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్థానికులు చెబుతున్నారు. అతను చాలా వేగంగా ట్రాక్టర్ నడుపుతున్నాడు. కనీసం చూసుకోకుండా బైకర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదం తర్వాత కూడా ఆపకుండా పారిపోయాడు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే స్థానికులు తక్షణమే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈఎంటీ సాయినాథ్, పైలట్ అశోక్ సంఘటన స్థలానికి చేరుకుని, క్షతగ్రాతుడు లక్ష్మీనారాయణకు తక్షణ ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అతన్ని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చేతికి ఫ్రాక్చర్ కావడంతో మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి నిర్మల్ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరారైన ట్రాక్టర్ డ్రైవర్‌ను గుర్తించి పట్టుకునేందుకు గాలింపు చర్యలు ముమ్మరంగా చేశారు.

స్వర్ణకారులకు బంగారం హాల్ మార్క్‌పై అవగాహన



నిర్మల్ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణకారులకు నిర్మల్ జిల్లా కేంద్రంలో హాల్‌మార్క్, అగ్‌మార్క్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత నాణ్యత ప్రమాణాల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శాస్త్రవేత్త తన్నీరు రాకేష్, ఇన్స్‌పెక్టర్ ప్రశాంతి, కూన గంగాధర్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు. బంగారు నాణ్యత ప్రమాణాలపై స్వర్ణకారులకు వివరించారు. స్వర్ణకారులు హాజరయ్యారు.

అర్హులైన వారందరికీ

రేషన్‌కార్డులను మంజూరు చేయాలి

● సీపీఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి



బోథ్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి

బోథ్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను మంజూరు చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు నెలవారి పెన్షన్‌తో పాటు ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని కోరారు. బీడీ కార్మికులు ఎంతో మంది గృహవసతికి మార్చుకోలేక పోతున్నారన్నారు. నకిలీ విత్తనాలను సరఫరా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం అకాల వర్షాల వల్ల తడిసిపోయిన ధాన్యాన్ని ఎలాంటి నిబంధనలు అడ్డుచెప్పకుండా పంట కొనుగోలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎల్.నరేష్, పట్టణ కార్యదర్శి పి.కార్తీక్, మండల సంయుక్త కార్యదర్శి ఎస్‌కే.మునిఫ్, రైతు సంఘం కార్యదర్శి ఓ.భోజన్న, ఎస్. దాస్, ఐ.ఎల్‌ట కార్యదర్శి సభ్యులు పాల్గొన్నారు.

మన్నేవార్, కోలవార్ తెగలకు

కార్పొరేట్ కళాశాలలో అవకాశం ఇవ్వొద్దు



ప్రజాపాలన నోడల్ ఆఫీసర్ దివ్యదేవరాజన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కోలాం సేవా సంఘం నాయకులు

ఉట్నూర్, జూన్3 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కళాశాలల్లో ఆదిమ గిరిజనులు కాని తెగలైనా మన్నేవర్/కొలావార్‌లకు ఇంటర్ ప్రవేశాలు కల్పించవద్దని, ఇటీవల గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ప్రకటించిన గిరిజనులు కాని మన్నేవార్/ కోలవార్‌లకు ప్రవేశానికి ఇవ్వద్దని కులం సేవా సంఘం రాష్ట్ర అడహాక్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు టేకం భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ప్రజాభవన్ నోడల్ ఆఫీసర్ దివ్యదేవరాజన్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ కమిష నర్ జారీ చేసిన ఉత్తర్వులను విరమించుకోవాలన్నారు. స్పందించిన దివ్య దేవరాజన్ ఆదిమ గిరిజనులకు అన్యాయం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే మన్నేవార్‌లకు కొలవార్‌గా ఇచ్చే హోదాను రద్దు చేయాలని, అలాగే సీసీడీపీ నుంచి నిర్మాణం చేపట్టిన గృహాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని నోడల్ అధికారి దృష్టికి తీసు కెళ్లారు. కోలాం సేవా సంఘం నాయకులు కుడమెత తిరుపతి, ఆత్రం ముకుందరావు, మేస్రం జయరాం, కుర్సెంగ వెంకటేశ్, కుడిమెత ముత్తయ్యలు పాల్గొన్నారు.

భూ భారతి రెవెన్యూ సదస్సులు ప్రారంభం

● దరఖాస్తులను స్వీకరించిన అధికారులు ● ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు పంపిన ఉద్యోగులు ● పలు చోట్ల భూ సమస్యలకు పరిష్కారం



బెల్సాపూర్ రాంపూర్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



తలమడుగు మండలం కోసాయి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజమోహన్



గంగాపూర్ రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జీ తహసీల్దార్ అమృతలాల్

ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ కేంద్రాల్లో రెవెన్యూ సదస్సులు మంగళవారం ప్రారంభమయ్యాయి. భూ సమస్యలు ఉన్న రైతులు అధికారులకు దరఖాస్తులను అందజేశారు. వాటి ద్యోగులు ఆన్‌లైన్‌లో ఫీడ్ చేసి, ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు. వీలైన చోట పరిష్కారం కూడా చూపెట్టారు.

ఉట్నూర్, జూన్3 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని గంగాపూర్, అందోలి, సాకెర గ్రామాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు భూభారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం నిర్వహించారు. గంగాపూర్‌లో జరిగిన గ్రామసభలో ఇన్‌చార్జీ తహసీల్దార్ జాదవ్ అమృత్‌లాల్ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సదస్సుల ద్వారా పట్టాదారు పాసుపుస్తకాలలో నమోదు కాని వివరాలు తెలిపితే వాటిని చేర్చడం జరుగుతుందన్నారు. సర్వేనెంబర్లు తప్పుగా ఉన్న నమోదు చేయడం జరుగుతుందన్నారు. వారసత్వ సమస్యలకు పరిష్కరిస్తున్నామన్నారు. మండలంలోని గంగాపూర్, సాకెర, అందోలిలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 22 భూ సమస్యల అర్జీలు వచ్చాయని అమృత్‌లాల్ వివరించారు. ఆయన వెంట గిర్దావర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్ , జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్సారి రాంపూర్ గ్రామాలలో మంగళవారం బీంపూర్ తహసిల్దార్ నలంద ప్రియ తన సిబ్బందితో కలసి భూ భారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. సదస్సు లో రైతుల నుంచి తీసుకునే దరఖాస్తుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుడిమేత సంతోష్, మాజీ సర్పంచ్ శంకర్, కార్యదర్శి సాయి కుమార్, సీనియర్ అసిస్టెంట్ రెడ్డ నర్సింలు, ఆర్‌ఐలు, రామ్ దాస్, విజయ్, జూనియర్ అసిస్టెంట్ ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

24 సంవత్సరాల భూమికి పరిష్కారం

తలమడుగు , జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి పథకం ద్వారా మండలంలో గత 24 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ఆదివాసుల భూ సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయి. మంగళవారం మండలంలోని కోసాయి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ఆదివాసి గిరిజన రైతులు తమ భూ సమస్యలకు పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోగా వాటిని పరిష్కరించేందుకు తహ సీల్దార్ రాజమోహన్ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజమోహన్ మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. ఈ సదస్సులు మండలంలో ప్రతిరోజు రెండు గ్రామాల్లో ఈనెల 20 వరకు నిర్వహిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కాగా మంగళవారం కోసాయి, రుయాడి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దాదాపు 30 వరకు దరఖాస్తులు వచ్చాయని వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరిచి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఇందులో తహసీల్దార్ రాజమోహన్. డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐ రోహిదాస్, సిబ్బంది, సాయి, సుదర్శన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భూభారతి రెవెన్యూ సదస్సులు ప్రారంభం

ఉట్నూర్, జూన్3 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని గంగాపూర్, అందోలి, సాకెర గ్రామాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు భూభారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం నిర్వహించారు. గంగాపూర్‌లో జరిగిన గ్రామసభలో ఇన్‌చార్జీ తహసీల్దార్ జాదవ్‌అమృత్‌లాల్ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సదస్సుల ద్వారా పట్టాదారు పాసుపుస్తకాలలో నమోదు కాని వివరాలు తెలిపితే వాటిని చేర్చడం జరుగుతుందన్నారు. సర్వే నెంబర్లు తప్పుగా ఉన్న నమోదు చేయడం జరుగుతుందన్నారు. వారసత్వ సమస్యలకు పరిష్కరిస్తున్నామన్నారు. మండలం లోని గంగాపూర్, సాకెర, అందోలిలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 22 భూ సమస్యల అర్జీలు వచ్చాయని అమృత్‌లాల్ వివరించారు. ఆయన వెంట గిర్ధావర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలు అందిస్తాం

● శాస్త్రవేత్త మోహన్‌దాస్

ఇంద్రవెల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలోని రైతుకు నాణ్యమైన విత్తనాలు అందజేస్తామని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డి.మోహన్‌దాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం అనే రైతు నేస్తం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు నేస్తం కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా విత్తన పంపిణీ చేయడం జరిగిందన్నారు. మండలంలోని ఆరు క్లస్టర్లకు చెందిన రైతులకు విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, వ్యవసాయ అధికారి రాథోడ్ గణేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు కరుణ, లతా భారతి, వీర, సురేష్, శవతేజ్, వివేక్ కుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త

విత్తనాలు నాటే యంత్రం అందజేత

తలమడుగు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం విత్తన కంపెనీ అయిన నూజివీడు సీడ్స్ వారు రైతులకు దాదాపు 15 వేల విలువగల విత్తనాలు పెట్టే యంత్రాన్ని రైతులకు అందజేశారు. గత రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని కృషీ విజ్ఞాన కేంద్రాల ద్వారా అధికసాంద్రత పద్ధతిలో పత్తి పంటసాగు పద్ధతిని రైతులకు పరిచయం చేసి రైతులకు సాగు పద్ధతులను వివరిస్తూ రైతులకు వివరించారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు

మంజూరు పత్రాలు అందజేత



బోథ్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంగళవారం మంజూరు పత్రాలు ఎంపీడీవో రమేష్ అందజేశారు. మండలంలోని పిప్పలదరి, కరత్వాడ, సాంగ్వి గ్రామాల్లో మంజూరు పత్రాలు అందజేశామని ఎంపీడీవో వివరించారు. నిర్మాణానికి మార్కౌట్ ఇచ్చారు. వేగవంతంగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని నాలుగువిడుతలలో ఐదు లక్షల రూపాయలు 4 విడతలలో అందివ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో అఖిల్‌కుమార్ ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



నేరడిగొండ , జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మండలంలోని వాంకిడి గ్రామంలో మంజూరైనా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మండల ఎంపీడీవో రాజ్ వీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో అన్నారు కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ గణేష్, ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ సెక్రెటరీ రాఘవ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు.

టీటీడీపీ రాష్ట్ర ఇన్‌చార్జీని కలిసిన గాలిపల్లి నాగన్న

ఆదిలాబాద్ అర్బన్, జూన్3 (ఆంధ్రజ్యోతి) : టీటీడీపీ రాష్ట ఇన్‌చార్జీ, పోలిట్ బ్యూరో మెంబర్ బక్కిని నర్సింలును మంగళవారం ఆదిలాబాద్ పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు గాలిపల్లి నాగన్న మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పట్టణ, మండల, యువత కమిటీల పై చర్చించి కమిటీల ఏర్పాటు కోసం తీర్మాణ పత్రాలను వారికి అందజేసినట్లు గాలిపల్లి నాగన్న తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఇన్‌చార్జీ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో దివాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు తోకల గంగమ్మ, అర్జున, అబ్బాయి కదరపు దేవిదాస్, దేవదాస్, రాష్ట్ర నాయకులు సందెపుగు రాజశేఖర్ పాల్గొన్నారు.

సాకెర గ్రామంలో చెక్‌డ్యామ్‌ను

పరిశీలించిన మాజీ మంత్రి అల్లోల



సాకెర గ్రామంలో చెక్ డ్యాంను పరిశీలిస్తున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

సోన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాకెర గ్రామంలో చెక్ డ్యాంను మంగళవారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరిశీలించారు. ఇటీవల బాంబు పేలుడు ఘనటలో ఈ చెక్ డ్యాం తీవ్రంగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన అక్కడి రైతులతో మాట్లాడారు. డ్యాం నష్టాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు సాగునీటి ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని తన మంత్రిత్వ కాలంలో ఈ చెక్ డ్యాం నిర్మించినట్లు ఆయన గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎమ్మెల్యే ఆధ్వర్యంలో దీన్ని విచక్షణ లేకుండా కూల్చి వేయడం బాధాకరమన్నారు. రైతులకు సాగునీటి కొరత తలెత్తే ప్రమాదం ఉంది. తద్వారా పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. భూగర్భ జలాల పునరుత్పత్తి ప్రక్రియకు ఇది తీవ్రంగా ఆటంకం కలిగిస్తుందన్నారు. ప్రజాధనం ఖర్చు చేసి నిర్మించిన డ్యాంను నాశనం చేయడం ప్రజల్లో అసంతృప్తి కలిగిస్తుందని ఆవేదన వ్యక్త చేశారు. పర్యావరణ సమతుల్యతకు ముప్పు, స్థానిక జీవ వైవిధ్యంపై చెడు ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన అల్లోల రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల నష్టాన్ని ఉపేక్షించడం సరికాదని వ్యాఖ్యానించారు. చెక్ డ్యాంను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.

నిరుపేద మహిళలకు డబుల్ బెడ్ రూమ్‌లు

ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేయాలి

నర్సాపూర్(జి), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలైన మహిళలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు పక్షపాతం లేకుండా పంపిణీ చేయాలని కోరుతూ నర్సాపూర్‌లోని నిరుపేద మహిళలు మంగళవారం మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కైలాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ... నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అనేక సార్లు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమ దరఖాస్తులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. నిరుపేదలు, ముఖ్యంగా మహిళలు సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయితే కొందరు అనర్హులు అక్రమంగా లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు దక్కేలా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, ఎలాంటి పక్షపాతం లేకుండా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను, ఇందిరమ్మ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని వారు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కైలాస్ స్పందిస్తూ మహిళల వినతిపత్రాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి : టీయూసీఐ

నిర్మల్ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ట్రేడ్ యూనియన్ సెంటర్ ఇండియా రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ భవన్‌లో మంగళవారం ఇందుకు సంబంధించిన లోగో ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. రాజన్న మాట్లాడుతూ... ఈ నెల 20, 21న రాష్ట్రసభలు నిజామాబాద్‌లో నిర్వహిస్తారని తెలిపారు.

భూ భారతి చట్టంతో సమస్యల పరిష్కారం

రెవెన్యూ సదస్సులో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



భూ సమస్యలపై మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



ధర్యాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్



సిర్గాపూర్‌లో తహసీల్దార్‌కు దరఖాస్తులు సమర్పిస్తున్న రైతులు

నిర్మల్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి చట్టం వల్ల ప్రజల భూ సమస్యలు త్వరగా పరిష్కారం పొందుతున్నాయని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం లక్ష్మణచాంద మండలం కనకాపూర్, మండలంలోని అక్కాపూర్‌లో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజల భూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసమే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చారని తెలిపారు. ఇప్పటికే తొలి విడత సదస్సులు విజయవంతంగా ముగిశాయని, నేటి నుండి 20వ తేదీ వరకు రెండో విడత రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వెల్లడించారు. సదస్సుల్లో పాల్గొన్న ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులు ప్రజల దరఖాస్తులను స్వీకరించి, వెంటనే రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. సకాలంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అక్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి, రైతుల భూ సమస్యల దరఖాస్తులపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో తరగతి గదులు, ఇంకుడు గుంతలు, లైటింగ్ వంటి వసతులను కలెక్టర్ పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్లు సరిత, సంతోష్, ఎంపీడీవో గజానన్, గిర్దావర్ సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

..సద్వినియోగం చేసుకోండి : భైంసా ఆర్డీవో

ముథోల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి అన్నారు. ముథోల్ మండలంలోని రాంటెక్‌లో ఆర్‌ఐ నారాయణ పటేల్ ఆధ్వర్యంలో చింతకుంట గ్రామంలో తహసీల్దార్ కే. శ్రీలత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు మంగళవారం ప్రారంభించారు. అయితే రాంటెక్ గ్రామ రెవెన్యూ సదస్సును ఆర్డీవో పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకే గ్రామాలకు రెవెన్యూ అధికారులను రప్పించి తమ సమస్యల పరిష్కారం కోసం ఈ ప్రతిష్టాత్మకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. పట్టా పాస్‌బుక్‌లలో తప్పులు దొర్లడం, తదితర అంశాల గురించి భూ సమస్యకు సంబంధించిన ప్రతి అంశం గురించి రైతులు నేరుగా ఈ సదస్సులో దరఖాస్తు చేసుకున్నట్లయితే 100 శాతం పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. చింతకుంట గ్రామ రెవెన్యూ సదస్సులో 21 దరఖాస్తులు, రాంటెక్ సదస్సులో 46 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ మండలంలో 58 దరఖాస్తులు

దిలావర్‌పూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం మంగళవారం నుంచి నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులకు రైతుల నుంచి స్పందన లభిస్తోంది. మండలంలో మొదటి రోజు నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులకు భూ సమస్యలకు సంబంధించి 58 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ తెలిపారు. సిర్గాపూర్‌లో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో 37 దరఖాస్తులు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో గుండంపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 21 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

నర్సాపూర్(జి) మండలంలో ఐదు దరఖాస్తుల స్వీకరణ

నర్సాపూర్(జి), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్యాపూర్, నందన్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ప్రజల నుండిమంచి స్పందన లభించింది. పౌరుల భూ సమస్యలు, ఇతర రెవెన్యూ సంబంధిత చిక్కులను అక్కడికక్కడే పరిష్కరించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ సదస్సులకు అధికారులు హాజరయ్యారు. ఈ సదస్సుల్లో గ్రామస్థుల నుంచి మొత్తం ఐదు దరఖాస్తులు స్వీకరించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

గ్రామాల వారీగా వివరాలు

ధర్యాపూర్ గ్రామంలో ఉదయం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజలు తమ భూ సమస్యలు, వారసత్వ మార్పులు, పట్టాదారు పాస్ బుక్‌ల వంటి అంశాలపై నాలుగు దరఖాస్తులు అందజేశారు. టీమ్-1 బృందంలో ఉన్న తహసీల్దార్ శ్రీకాంత్ ఈ దరఖాస్తులను స్వయంగా స్వీకరించారు. గ్రామస్థులు తమ సందేహాలను నేరుగా అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. అలాగే నందన్ గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఒకే ఒక్క దరఖాస్తు అందినట్లు అధికారులు పేర్కొన్నారు. టీమ్-2 బృందంలో నాయబ్ తహసీల్దార్ వాహిద్ ఉద్దీన్, గిర్ధావర్ సుమలత, రికార్డ్ అసిస్టెంట్లు అశోక్, సాయన్న, కళ్యాణి పాల్గొని ఈ దరఖాస్తులను స్వీకరించారు. తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన, వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, చట్టబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

లోకేశ్వరంలో మొదటిరోజు 61 దరఖాస్తులు

లోకేశ్వరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలంలోని రాజుర, పొట్‌పల్లి(బి) గ్రామ పంచాయతీలలో రెవెన్యూ సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ రెండు గ్రామ పంచాయతీల్లో 80 అప్లికేషన్ ఫారాలు రైతులకు అందజేయగా 61 అప్లికేషన్ ఫారాలు రైతులు తమ భూమికి సంబంధించిన వివిధ కారణాలు కలిగిన వివరాలను అప్లికేషన్ ఫారంలో నింపి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్వరం తహసీల్దార్ సర్వరాజ్, డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ... రైతుల భూమికి సంబంధించిన ఏవైతే తప్పులు ఉన్నాయో అవన్నీ కూడా సరి చేసుకోవడానికి మంచి అవకాశమని అందరూ ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

టీఎస్‌యూటీఎఫ్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ పిలుపు



నర్సాపూర్(జి), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) నిర్మల్ జిల్లా శాఖ నడుం బిగించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను ప్రోత్సహించే లక్ష్యంతో టీఎస్‌యూటీఎఫ్ నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఒక ప్రచార జాతాను ప్రారంభించారు. ఈ జాతాలో భాగంగా నర్సాపూర్(జి), రాంపూర్ పాఠశాలల పరిసరాల్లోని వీధి వీధినా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరిశంకర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రస్తుతం ప్రశార్థకంగా మారుతోంది. ఈ క్లిష్ట సమయంలో ఒక సమాజిక స్పృహ కలిగిన సంఘంగా టీఎస్‌యూటీఎఫ్ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ 'బడిబాట' కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఆయన మరింత వివరిస్తూ భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగైతే పేద పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే స్థోమత లేక ప్రభుత్వ బడులు కూడా లేకపోతే పిల్లలు బడి మానేసే పరిస్థితులు రావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే తాము ఊరూరా తిరిగి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను తెలియజేస్తూ వాటిని కాపాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు గట్టు శ్రీనివాస్, కుంటాల పోశెట్టి, రమేష్ రాథోడ్, గణపతి, చందుల వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి అవార్డు గ్రహీతకు సన్మానం

కడెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్ శకుంతలను రాష్ట్రంలోనే ప్రథమంగా నిలిచినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రితో ప్రశంసా అవార్డు దక్కించుకున్న సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఇటీవల వెలువడిన రాష్ట్ర స్థాయి ఫలితాల్లో 10వ, 12వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినందుకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయ సంఘం మండల నాయకులు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేష్ నాయక్, ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి కిషన్ నాయక్, ఉపాధ్యాయ సంఘం నేతలు ఇందార్ నేత, బీర చిన్నయ్య, రాజేశ్వర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

సోన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోన్ ఉన్నత పాఠశాలలో ఒకటి నుండి పదవ తరగతి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ పంపిణీ చేశారు.


ముథోల్ వ్యవసాయ పరిశోధన స్థానం


గతంలో పరిశోధన చేసిన పత్తి (ఫైల్)

రైతు నేస్తం

ముథోల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం

- పంట దిగుబడులను పెంచేందుకు కొత్త వంగడాలపై దృష్టి • సర్జికల్ కాటన్ ఉత్పత్తిలో అగ్రగామిగా పేరు
- 1934లో ప్లాంట్ బ్రీడింగ్ స్టేషన్‌గా ఏర్పాటు • 1944లో పరిశోధన స్థానంగా ఏర్పాటు
- నిర్మల్ జిల్లాకే తలమానికంగా ముథోల్ వ్యవసాయ పరిశోధన స్థానం




వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ముథోల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతుల దిగుబడులు పెంచడమే లక్ష్యంగా ముథోల్ వ్యవసాయ పరిశోధన స్థానం పని చేస్తోంది. ఇక్కడ కోట్ల వంగడాలను సృష్టిస్తూ పంట దిగుబడులను పెంచేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. 1934లో సుమారు 46 ఎకరాల విస్తీర్ణంలో ప్లాంట్ బ్రీడింగ్ స్టేషన్‌గా స్థాపించగా.. 1944లో వ్యవసాయ పరిశోధన స్థానంగా ఏర్పాటుచేశారు. ఆ సమయంలో నియోజకవర్గంలోని ఎక్కువ ప్రాంతంలో దేశీవాళి పత్తిని సాగుచేసేవారు. పత్తిపై కొత్త రకమైన వంగాలను పరీక్షించడానికి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని ముథోల్ వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నర్సయ్య చెప్తున్నారు. గతంలో వేరే పరిశోధన స్థానంలో రూపొందించిన వంగడాలను ఇక్కడికి తీసుకువచ్చి మన ప్రాంతంలో పరీక్ష చేసేవారు. తర్వాత దేశీవాళి పత్తిలో కొత్త రకాలను రూపొందించడానికి బ్రీడింగ్ మొదలు పెట్టారు. పరిశోధన స్థానంలో ప్రస్తుతం ఏరువాక కేంద్రానికి ఇద్దరు శాస్త్రవేత్తలు, పరిశోధన కేంద్రానికి ఒక శాస్త్రవేత్త ఉన్నారు. జూనియర్ అసిస్టెంట్‌లు 2, అటెండర్, ఏఈవో, వాచ్‌మెన్, ఏడబ్ల్యూఎంఎస్2, ఫీల్డ్ స్టాఫ్ 2 ఉన్నారు.

కనుగొన్న వంగడాలు

సరస్వతీ అనే దేశీవాళి రకానికి చెందిన పత్తి రూపొందించి 1978లో విడుదల చేశారు. కొన్ని సంవత్సరాల పాటు రైతు ఇక్కడ సాగు చేశారు. 1944లో గౌరని అనే రకం దేశీవాళి పత్తి రకాన్ని కనుగొన్నారు. 1970 సంవత్సరం తర్వాత 80 దశకంలో అమెరికన్ జాతి పత్తి హైబ్రిడ్ రకాలు (ఎన్‌హెచ్‌హెచ్ 44) సూటిరకాలు (ఎల్‌ఆర్‌ఏ 51 66) లాంటివి రావడంతో దేశీవాళి పత్తి బదులు రైతులు అమెరికన్ జాతి పత్తి పంటను పండించటం మొదలుపెట్టారు. దీంతో దేశీవాళి పత్తి పంట కింద ఉన్న విస్తీర్ణం 1990 నాటికి తగ్గుతూ వచ్చి 2000 సంవత్సరానికి పూర్తిగా తగ్గిపోయింది. 2002లో శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ ప్రదీప్‌లు వీణ అనే దేశీవాళి పత్తి రకాన్ని అభివృద్ధి చేసినా ఎక్కువ మొత్తంలో పండించకపోవడంతో ఈ రకం ప్రాచుర్యం పొందలేదు. 2002 నుంచి ఇక్కడ అమెరికల్ జాతి పత్తిలో కూడా బ్రీడింగ్ మొదలు పెట్టారు. దీంట్లో కొత్త రకాన్ని రూపొందించడానికి పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఎండీఎల్ 26 63, ఎండీఎల్ 26 67, 26 74 చిన్న పత్తి రకం వంగడాలు జాతీయ స్థాయిలో పరిశోధన జరుగుతుందని రిలీజ్ కాలేదని శాస్త్రవేత్తలు తెలిపారు.

సర్జికల్ కాటన్

దేశీవాళి పత్తి సుమారు ఎనిమిది సంవత్సరాలు జరిగిన పరిశోధన ద్వారా సర్జికల్ కాటన్ ఉపయోగపడే పలు గుణాలు కలిగిన పత్తి రకాన్ని అప్పటి శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పరిశోధన చేశారు. దేశంలో కానీ విదేశాల్లో కానీ సర్జికల్ రకం పత్తికి చాలా డిమాండ్ ఉంది.

వర్మీ కంపోస్ట్

నేటి ఆధునిక వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వాడకం తగ్గింది. అధిక మొత్తంలో సేంద్రియ ఎరువులను ఉత్పత్తి చేయడానికి 2008 సంవత్సరంలో ఇక్కడ పని చేసిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్ వర్మీ కంపోస్ట్ ఎరువును కనుగొన్నారు. పత్తి కర్రను ఉపయోగించి వర్మీ కంపోస్ట్‌ను ప్రయోగాత్మకంగా దేశంలోనే విజయవంతంగా తయారు చేసు చేస్తున్నారు. ఈ వర్మీ కంపోస్ట్ తయారీపై గతంలో చాలామంది రైతులకు శిక్షణ సైతం ఇచ్చారు.

సోయాబీన్, శనగ, నువ్వులపై పరిశోధనలు

సోయాబీన్ శనగ బ్రీడర్ విత్తన ఉత్పత్తి జరుగుతున్నాయని శాస్త్రవేత్త నర్సయ్య చెప్తున్నారు. వాటిపై పూర్తి పరిశోధన జరిపి సంబంధిత సీడ్స్ అభివృద్ధి సంస్థకు పంపినట్లు తెలిపారు. అలాగే నువ్వు, కందిపై కూడా విత్తనోత్పత్తి చేస్తామని చెప్తున్నారు. సోయాబీన్, శనగ పంటలపై పరిశోధన జరుగుతున్నాయని, రైతుల క్షేత్రస్థాయిలకు వెళ్లి రైతులకు సలహా, సూచనలు యాజమాన్య పద్ధతులు శాస్త్రవేత్తంగా వెళ్లి వివరిస్తామని వెల్లడించారు. నిర్మల్ జిల్లాలోనే అగ్రగామిగా ఈ ఏరువాక వ్యవసాయ పరిశీలన నిలుస్తుందని అలాగే విద్యార్థుల చేత సందర్శించి వివరాలు తెలుసుకునేందుకు వస్తుంటారని తెలిపారు.

2020లో ఏరువాక ఏర్పాటు

జిల్లాలోని ముథోల్ వ్యవసాయ పరిశీలన స్థానంలో 2020 జూన్‌లో ఏరువాక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులకు కొత్త వంగడం తెలియజేయడం, భూసార పరీక్షలు చేయడం, అధిక సాంద్రత పత్తి వరిలో విడుదల పద్ధతి పంటల క్షేత్ర పర్యటన కార్యక్రమం చేపట్టి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతులకు తగు సలహా, సూచనలు ఇస్తున్నారు.

మెళకువలతో అధిక దిగుబడులు



• నర్సయ్య, ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి, ముథోల్ వ్యవసాయ పరిశోధన స్థానం

శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మెళకువలను పాటిస్తే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం జిల్లాలో సాగుతోంది. నిర్మల్ జిల్లాలో సాగుపై రైతులకు అవగాహన సదస్సులను కల్పిస్తూ సలహా, సూచనలను ఇస్తున్నాం. అలాగే శిక్షణ కార్యక్రమం చేపడుతున్నాం. ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్నాం. యూరియా తక్కువ వాడాలని చెబుతున్నాం. సేంద్రియ ఎరువులు పెంచాలని వివరిస్తున్నాం. అధిక రసాయన ఎరువుల వలన భూసారం కోల్పోతుందని పేర్కొన్నారు. అధిక యూరియాతో దిగుబడులు తగ్గిపోతాయని రైతులకు వివరిస్తున్నాం. అలాగే మా డాట్ సెంటర్ ద్వారా సిరి సంచులను రైతులకు అందజేస్తున్నాం. ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు కొనాలి.

కొత్త వంగడాలపై దృష్టి



• డా. విజయ్ కుమార్, శాస్త్రవేత్త, ముథోల్

ఈ పరిశోధన స్థానంలో కొత్త వంగడాలపై దృష్టి పెట్టాం. ప్రస్తుతం నువ్వు, సోయా, శనగ, కంది పంటలపై పరిశోధన జరుగుతున్నాయి. అలాగే రైతులు సేంద్రియ ఎరువులపై కూడా మొగ్గు చూపేలా అవగాహన కల్పిస్తాం. సోయా, పత్తి, వరి తదితర పంటలపై సలహాలు, సూచనలు ఇస్తున్నాం. చీడపీడల నివారణకు చర్యలపై తెలియజేస్తున్నాం. సందేహాలుంటే మమ్మల్ని సంప్రదిస్తే సలహాలు అందిస్తాం.


పచ్చని చెట్ల మధ్య కార్యాలయ భవనం

రైతుల అభివృద్ధే మా లక్ష్యం



• డా. కార్తీక్, శాస్త్రవేత్త

రైతులు వేసిన పంటలను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి వారికి తగిన రీతిలో సలహాలు, సూచనలు ఇస్తున్నాం. తెలియని రైతులకు యాజమాన్య పద్ధతులను తెలియజేస్తున్నాం. మా వంతు రైతులకు ఎల్లవేళలా మెళకువలు, సలహాలు ఇచ్చేందుకు సిద్ధంగాఉన్నాం. రైతులు సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని చెబుతున్నాం.




రేషన్ బియ్యం కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు



రేషన్ కోసం పరుగులు

ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు మూడు నెలల బియ్యాన్ని కోటాను ఒకేసారి అందజేస్తోంది. మూడు నెలలకు సరిపడా కోటాను ఈ నెలలోనే తీసుకోవాలని సూచించింది. దీంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు పరుగులు పెడుతున్నారు. ఎక్కడ బియ్యం నిల్వలు అయిపోతాయోననే ఆందోళనతో రోజంతా ఆయా రేషన్ దుకాణాల వద్దే గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. దుకాణాలకు లబ్ధిదారులు అధిక సంఖ్యలో వస్తుండడంతో వాటి వద్ద సందడి నెలకొంది.

• ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్


రేషన్ బియ్యం కోసం బారులు తీరిన లబ్ధిదారులు

విద్యార్థులకు కరాటే, యోగా అవసరం : ఏఎస్పీ

ఇంద్రవెల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు విద్యతో పాటు యోగా, కరాటే చాలా అవసరమని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక జడ్పీఎస్ఎస్ పాఠశాల ఆవరణలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో పాల్గొన్న 30 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ కాజల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో, యోగా, కరాటే వంటి వాటిల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మొగిలి, స్థానిక ఎస్సై సాయన్న, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన గ్రీన్ ఇండియా చాలెంజ్ వారియర్స్

దిలావర్‌పూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ అశోక్ ఆధ్వర్యంలో మండలంలో మంగళవారం మొక్కలు నాటారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు జన్మదిన సందర్భాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో మొక్కలు నాటినట్లు అశోక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్(జి) మండల బీఆర్ఎస్ కన్వీనర్ టి.సుధన్, మాడేగాం మాజీ సర్పంచ్ రాజు, సారంగాపూర్ మండల గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కన్వీనర్ లక్ష్మణ్, దిలావర్‌పూర్ గ్రామ వార్డు మెంబర్ కొప్పుల శ్రీనివాస్, నాయకులు అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై పశువుల సంచారం

- ప్రమాదం సంభవిస్తే కాని స్పందించని అధికారులు • విధిదీపాలు లేక చీకటిమయంగా ఇచ్చోడ ప్రధాన రహదారి

ఇచ్చోడ, జూన్3 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పశువులకు అడ్డాగా మారుతోంది. పగలు రాత్రి అనే తేడా లేకుండా అవి రహదారిపై సంచరిస్తున్నాయి. ప్రధాన రహదారిపై విధిదీపాలు లేకపోవడం చీకటిగా ఉండడంతో వాహనాలు దగ్గరి వరకు వచ్చేదాక పశువుల కనిపించడంలేదు. దీంతో వాహనదారులు రాత్రిళ్లు మూగజీవాలను ఢీకొని ప్రమాదాల బారీన పడుతున్నారు. అప్రమత్తంగా లేనప్పుడు పలుమార్లు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. రోడ్లపైకి పశువులు రాకుండా ఆరికట్టాలని వాహనదారులు పలుమార్లు కోరినా అధికారులు పెడచెవిన పెడుతున్నారు. పశువుల యజమానులు సైతం పశుసంపదను కాపాడుకోవాల్సిందిపోయి రోడ్లపై వదిలేయడం ఏంటనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యను మేజర్ పంచాయతీ అధికారులు పరిష్కరించి రోడ్లపై పశుసంచారం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పశువుల యజమానులు సైతం పశులను కాపాడు కోవాల్సిందిపోయి రోడ్లపై వదిలేయడం ఏంటనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


ఇచ్చోడ ప్రధాన రహదారిపై పశువులు ఇలా..


రాత్రి సమయంలో రోడ్డుపై నిలిచి ఉన్న పశువులు


బాసర ఆర్జీయూకేటీ క్యాంపస్

నాలుగు రోజులు.. ఐదువేల దరఖాస్తులు

బాసర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటిలో ప్రవేశానికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మే 31 నుంచి అడ్మిషన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. జూన్ 3 నాటికి విద్యార్థుల నుంచి 5వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. కేవలం నాలుగు రోజుల్లో 5వేలకు పైగా దరఖాస్తులు రావడం పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల గడువులో 12వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఏడాది దరఖాస్తుల స్వీకరణకు జూన్ 31 ఆఖరి రోజు అయినప్పటికీ ప్రారంభంలోనే ఇంత స్పీడుగా దరఖాస్తులు రావడం ఈసారి పోటీ తీవ్రంగా ఉంటుందని అర్థమవుతోంది. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశం కల్పించే యూనివర్సిటీకి విద్యార్థులు, తల్లిదండ్రులకు మంచి అభిప్రాయం ఉంది. సీటు లభిస్తే అదృష్టంగా భావిస్తారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికై మంచి ఉద్యోగాల్లో స్థిరపడినవారు ఎందరో ఉన్నారు. అయితే గత రెండేళ్ల నుంచి ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సంఖ్య గణనీయంటా తగ్గిపోయింది. ఈసారి దరఖాస్తులు ప్రారంభంలోనే ఎక్కువ రావడంపై బాసర ట్రిపుల్ ఐటికి మునుపటి రోజుల వల్లే తీవ్ర పోటి ఉంటుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

స్పీక్‌మేకే అంతర్జాతీయ సమ్మేళనంలో ఆర్జీయూకేటీ విద్యార్థులు

బాసర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ హైదరాబాద్‌లో జరిగిన స్పీక్‌మేకే 10వ అంతర్జాతీయ సమ్మేళనంలో బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు పాల్గొన్నారు. వారం రోజుల పాటు ఈ సమ్మేళనం సాగింది. ఈ సమ్మేళనంలో దాదాపు 35మంది విద్యార్థులు తమ సంస్కృతిక చైతన్యం, దేశకళల పట్ల గల గౌరవాన్ని ప్రపంచానికి తెలియజేశారు. వికాసానికి, దేశ నలుమూలల నుంచి ఎంతో మంది కళాకారులకు సహయ వాలంటీర్లుగా చేరి మన్ననలను పొందారు. మీడియా విభాగంలోనూ చేరి స్పీక్‌మేకే 10వ అంతర్జాతీయ సమ్మేళనం గురించి ప్రచారం చేయడంలో సహయపడ్డారు. విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొంటూ కథక్, కూచిపూడి, భరతనాట్యం, కర్ణాటక సంగీతం, గోండు పెయింటింగ్ వంటివి నేర్చుకున్నట్లు యూనివర్సిటీ అధికారులకు తెలిపారు. స్పీక్‌మేకేలో భారతదేశ కళలను పరిచయం చేయడం, గొప్ప కళాకారులను కలిసే అదృష్టం వచ్చిందని, వారి అనుభవాలు జీవితంలో ఎంతో సహాయపడతాయని విద్యార్థులు హర్షం వ్యక్తంచేశారు. స్పీక్‌మేకే 10వ అంతర్జాతీయ సమ్మేళనంలో అధ్యాపకులు డా.శ్రావన్, డా.రాకేశ్‌రెడ్డి, లకుమాదేవి, పూర్వవిద్యార్థులు శివబాలాజీ, వంశీకృష్ణ, రచన, మణికంఠ పాల్గొన్నారు.

కరుణించవమ్మా.. రేణుకా ఎల్లమ్మ

దిలావర్‌పూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోరిన వారి కొంగు బంగారం.. అడిగిన వారికి వరాలనొసగే శ్రీ దిలావర్‌పూర్ ఎల్లమ్మ తల్లి దేవస్థానం మంగళవారం వందలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసింది. అమ్మవారి పవిత్ర పుష్కరిణిలో స్నానాలు చేసిన భక్తులు అమ్మవారికి పెరుగన్నంతో నైవేద్యం సమర్పించారు. ప్రత్యేకపూజలు చేశారు. పిల్లాపాపలను పురుగు పుట్రల నుంచి కాపాడాలని, చల్లంగా చూడాలని ఎల్లమ్మ తల్లిని మొక్కుకున్నారు. అమ్మవారి దేవస్థానం పరిసరాల్లో చెట్ల కింద వంటలు చేసుకుని భోజనాలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి దేవస్థానం చుట్టూ భక్తుల కోలహాలం కనిపించింది. ప్రతీఏటా మొక్కులు చెల్లించుకునే భక్తుల సంఖ్య పెరుగుతోంది. పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా దేవస్థానంలో సదుపాయాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.


ఆలయానికి తరలిచవ్చిన భక్తులు

ఐటీఐలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఆదిలాబాద్, జూన్3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఆదిలాబాద్ ఐటీఐలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ టీ.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ఇంజనీరింగ్ శిక్షణ పొందడానికి అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 2 నుంచి 21 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు 10వ తరగతి కాని 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, వయస్సు 1-8-2025 నాటికి 14 సంవత్సరాలు నిండాలన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఐటీఐ కన్వీనర్, ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు.

హోంగార్డులకు ఆరోగ్య భద్రతా కార్డులు

● జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



హోంగార్డులకు ఆరోగ్యభద్రత కార్డులు అందజేస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): హోంగార్డులకు చేయూత నందించాలనే ఉద్దేశంతో ఆరోగ్యభద్రతకార్డులు అందజేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. జిల్లాలోని ఇండియన్ మెడికల్ అసోసి యేషన్‌లో సభ్యులైన జిల్లా ప్రైవేట్ వైద్యుల సహకారంతో జిల్లాలో మొట్టమొదటిసారిగా హోంగార్డులకు ఆరోగ్యభద్రత కార్డులను ప్రారంభించామన్నారు. మంగళవారం పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ హోంగార్డులకు ఆరోగ్యభద్రత కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని 240 హోంగార్డులకు, వారి కుటుంబసభ్యులకు జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లోని కార్పొరేట్ వైద్యం వీలైనంత వరకు రాయితీలో లభించనుందని తెలిపారు. ముఖ్యంగా ఓపీ సేవలను ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చిన జిల్లా ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులకు జిల్లా ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హోం గార్డులకు ప్రైవేట్ ఆసుపత్రులలో ఓపీ సేవలు ఉచితంగాను, ఇతర సేవ లలో వీలైనంత వరకు రాయితీ అందించనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులతో, ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలు, వైద్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీకి ప్రైవేట్ వైద్యులు తెలియజేశారు. పోలీసు వ్యవస్థలో హోంగార్డులు అతి తక్కువ జీతంతో నిత్యం పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తుంటారని, వారు తమ ఆరోగ్యం పట్ల, వారి కుటుంబసభ్యుల ఆరోగ్యాల పట్ల శ్రద్ధ వహిస్తూ ఉండాలని ఎస్పీ తెలిపారు. ప్రత్యేకంగా హోంగార్డులకు ఆరోగ్యభద్రత కార్డులను ముద్రించి వాటిపై హోంగార్డు పేరు, చిరునామాతో పాటు వారి కుటుంబ సభ్యుల వివరాలను పొందుపరిచి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సంతకంతో హోంగార్డు ఆరోగ్య భద్రత పత్రం ధృవీకరించబడి ఉంటుందని వాటిని ప్రైవేట్ ఆసుపత్రిల యజమాన్యం పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఇందులో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ఐపీఎస్, సీసీ కొండ రాజు, హోంగార్డు ఆర్ఐ ఎన్ చంద్రశేఖర్, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ రమేష్, హోంగార్డు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపట్టాలు పంపిణీ చేసిన ఎంపీడీవో

సోనాల, జూన్3 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలో మంగళవారం ఎంపీడీవో రాజేశ్వర్ అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో ఎలాంటి జాప్యం జరగకుండా అర్హులైన లబ్దిదారులందరికి ఇళ్ల పట్టాలు అందజేస్తామన్నారు.



- జిల్లాలో ఊపందుకున్న వానాకాల పంటల సాగు
- పెట్టుబడి సాయం కోసం దిక్కులు చూస్తున్న అన్నదాతలు
- గత్యంతరం లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- పోలీసుల దాడులతో అప్పులు ఇచ్చేందుకు వెనకాడుతున్న వ్యాపారులు
- ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో అన్నదాతల్లో అయోమయం

రైతు భరోసా ఇంకెప్పుడు?

ఆదిలాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మునుపెన్నడూ లేని విధంగా ఈ యేడు ముందస్తు వర్షాలు కురియడంతో వానాకాల సీజన్ పనులు ఊపందుకుంటున్నాయి. మే 20 నుంచి 29 వరకు జిల్లాలో ఓ మోస్తరు స్థాయి నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీంతో రైతులు వానాకాల పంటల సాగు పనులకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు యాసంగి, వానాకాల సీజన్‌లో రైతుబంధు పథకం కింద పెట్టుబడి సహాయాన్ని అందిస్తూ వచ్చింది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పథకం పేరును మారుస్తూ రైతుభరోసా పేరిట రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నారు. గతంలో ఎకరాన రూ.5వేలు ఇవ్వగా.. వెయ్యి రూపాయలు పెంచి రూ.6వేలను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. సీజన్ ప్రారంభమై పక్షం రోజులు గడిచిపోతున్నా రైతుభరోసా రాకపోవడంతో గ్రామాల్లో ఇంకెప్పుడు ఇస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సహాయాన్ని అందిస్తే రైతులకు ఇబ్బందులు ఉండవంటున్నారు. కానీ మరింత జాప్యం చేస్తే పెట్టుబడి లేక సాగు పనులు వెనకబడి పోయే అవకాశం ఉందంటున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు రైతుభరోసాపై ఊసెత్తక పోవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. జిల్లాలో లక్షా 49వేల మంది రైతులకు రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సహాయం అందుతుందని అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. దీనికి గాను ప్రభుత్వం రూ.286 కోట్లను జిల్లాకు విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ నిధుల విడుదలలో ప్రతీసారి జాప్యం జరగడంతో అన్నదాతలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

అక్కరకు రాని ప్రభుత్వ సహాయం..

జిల్లాలో ప్రతియేటా మే చివరిలోనే వానాకాల పంటల సాగు పనులను ప్రారంభిస్తారు. ఇప్పటికే సాగు సందడి కనిపిస్తోంది. అయినా ప్రభుత్వం పెట్టుబడి సహాయాన్ని అందించడం లేదంటున్నారు. వానాకాల సీజన్‌కు ముందే పెట్టుబడి సహాయాన్ని అందించి ఉంటే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసుకుని సిద్ధంగా ఉంటారు. వర్షాలు కురవగానే పంటలను సాగుచేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఉద్దేశ్యం మంచిదే అయినప్పటికీ సహాయం అందించడంలో ప్రతిసారి జాప్యం జరగడంతో ప్రభుత్వ సహాయం అక్కరకు రాకుండా పోతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరించి ఉంటే కొంత మేరకైనా ఇబ్బందులు తప్పి ఉండేవని రైతులు చెబుతున్నారు. ఎలాగో అప్పు చేసి పంటలను సాగు చేస్తున్నా.. పెట్టుబడి సహాయం ఆలస్యమైతే ఇతర అవసరాలకు ఖర్చయ్యే అవకాశం ఉందంటున్నారు. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేక పోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలు చేసుకునే అవకాశం కూడా ఉందంటున్నారు.

వడ్డీ వ్యాపారులే దిక్కు..

సమయానికి ప్రభుత్వ సహాయం అందకపోవడంతో రైతులకు మళ్లీ వడ్డీ వ్యాపారులే దిక్కవుతున్నారు. అధిక వడ్డీలైనా అప్పులు చేయక తప్పడం లేదంటున్నారు. అప్పులు చేస్తూ ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మే మొదటి వారంలోనే పెట్టుబడి సహాయాన్ని అందిస్తే రైతులకు కొంత ఉపయోగకరంగా ఉండేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. రైతులకు చేతిలో డబ్బులు ఉంటేనే ఎరువులను తరలించడం విత్తనాలను కొనుగోలు చేయడం, ట్రాక్టర్ యంత్రాలకు అద్దెలు చెల్లించడం, సేంద్రియ ఎరువుల తరలింపు వంటి పనులను చేపడుతారు. జూన్ మొదలైనా పెట్టుబడి సహాయం అందకపోవడంతో గత్యంతరం లేక ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. రైతుల అమాయకత్వం, అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న దళారులు 25శాతం వడ్డీ చొప్పున అప్పులు ఇస్తున్నారు. ఆలస్యంగా ప్రభుత్వం అందించే పెట్టుబడి సహాయం వడ్డీలకే సరిపోవడం లేదంటూ రైతులు చెబుతున్నారు. ఇచ్చేది ఏదో సమయానికి ఇస్తే ఇబ్బందులు దూరమై పంటల సాగు పనులను చేపట్టే అవకాశం ఉందంటున్నారు.

అప్పు పుట్టడం కష్టమే..

వానాకాల సీజన్ ప్రారంభంకావడంతో రైతులు పెట్టుబడుల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. బ్యాంకులు సవాలక్ష నిబంధనలు విధించడంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వైపే రైతులు మొగ్గుచూపుతున్నారు. బంగారం తాకట్టు, భూమి మాడిగేజ్, అధిక వడ్డీలు, ఇలా వివిధ రకాలుగా రైతులు వ్యాపారుల నుంచి అప్పులు తీసుకుంటారు. కానీ మునుపెన్నడూ లేని విధంగా ఈ సారి నిబంధనలకు విరుద్ధంగా అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చే వారిపై జిల్లా పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఇప్పటివరకు పలువురు వడ్డీ వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. దీంతో అప్పులు ఇచ్చేందుకు వడ్డీ వ్యాపారులు కూడా వెనకాడుతున్నారు. ఒకవేళ ఇచ్చిన గుట్టుచప్పుడుకాకుండా వడ్డీ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఆచితూచి అప్పులు ఇస్తున్నారు. రైతుల అవసరం మేరకు కాకుండా ఎంతో కొంత ఇచ్చి పంపుతున్నారు. గ్రామాల్లో కొంత మంది దళారులు రైతుల పట్టాపాస్ పుస్తకాలను తీసుకొని మరీ అప్పులు ఇస్తున్నట్లు సమాచారం.

యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే పాయలశంకర్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయలశంకర్

ఆదిలాబాద్ అర్బన్,జూన్3 (ఆంధ్ర జ్యోతి): భారతదేశ ప్రాచీనమైన యోగాను ప్రపంచ వ్యాప్తం చేసిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీదని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రిమ్స్ నుంచి ఆయుష్ ఆధ్వర్యంలో యోగాపై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌రాథోడ్, ఆయుష్ ప్రోగ్రాం అధికారి ప్రతి ల్‌రాథోడ్, ఆయుష్‌సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూసేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన సాగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో పీఎం భారత దేశ ప్రాచీన యోగాను ప్రపంచానికి తెలియజేశారన్నారు. యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు ఉన్నాయని అన్నారు. యోగా ప్రాధాన్యత పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతిరోజు గంట సమయం యోగా లేదా వ్యాయమం చేస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఇందులో బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, రత్నాకర్‌రెడ్డి, జోగురవి, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా అమృత్ పథకం కింద 8 నీటి ట్యాంకు లను మంజూరు చేసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే పాయలశంకర్ తెలపారు. మంగళవారం బంగారిగూడలో ఆరులక్షల నీటి సామర్థ్యంతో ట్యాంక్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ దాదాపు 5 ట్యాంకునిర్మాణ పనులు వివిధ దశలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో బంగారి గూడలో నెలకొన్న నీటిసమస్య పరిష్కారం అవు తుందన్నారు. అదేవిధంగా పైప్‌లైన్ నిర్మాణ పనులు సైతం పూర్తిచేస్తామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం చేపడతామని తెలిపారు. కోట్ల నిధుల వ్యయంతో ఆదిలాబాద్ పట్టణాభివృద్ధికి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఆదిలాబాద్‌కు అమృత్ పథకం మంజూరు చేసిన ప్రధాని నరేంద్రమోదీకి సహకారం అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అధికారులు సైతం పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఇందులో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ముక్కెర శ్రీనివాస్, కృష్ణ అజయ్, జోగురవి, మోహన్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

● కలెక్టర్ రాజర్షి షా



అడేగామ(కే)లో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్



ధన్నోర్ (బీ)లో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

నేరడిగొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరెపల్లి గ్రామంలో భూ భారతి రెవెన్యు సదస్సులలో జిల్లా పాలనాధికారి రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలసి దరఖాస్తులను పరిశీలించారు. తెలంగాణ రాష్ట ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన భూభారతి రెవెన్యూచట్టం - 2025 రెవెన్యూ గ్రామసభలు ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు ఉన్న రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించడం కోసం ఈ సదస్సులను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ గ్రామస్తులకు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో భోరజ్ మండలంలో ఇప్పటికే రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈసారి రెండు బృందాలుగా రెవెన్యూ సిబ్బందిని నియమించి ఉదయం 9 నుంచి 4 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే స్థానిక తహసీల్దార్లు పూర్తిస్థాయిలో సంబంధిత రెవెన్యూ గ్రామాల్లో ప్రచారం నిర్వహించి ప్రజలకు సమాచారం అందించామన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం రెవెన్యూ గ్రామ సభలను పక్కాగా నిర్వహించాలని దరఖాస్తుదారులకు ముందస్తు ఫారాలను ఇవ్వాలని వారి యొక్క దరఖాస్తులను పరిశీలించి స్వీకరించాలన్నారు. సదస్సులలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశామని వాటి ద్వారా దరఖాస్తుదారులకు తగు సూచనలు చేస్తూ దరఖాస్తులను పూరించుటకు సహకరించాలన్నారు. సదస్సులో నేరడిగొండ, మండల తహ సీల్దార్ కలిమ్, డీటీ మహేష్, ఎంఆర్ఐ నాగో రావ్, సీనియర్ అసిస్టెంట్ మీరా బాయి. పంచాయతీ సెక్రటరి, ఆపరేటర్లు, సిబ్బంది, రైతులు. నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ : భూమికి సంబంధించిన ఎలాంటి సమస్యలున్నా మీ గ్రామంలో చేపట్టే భూభారతి రెవెన్యూ గ్రామసభలో పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం ఇచ్చోడ మండలంలోని అడేగామ(కే) గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు హాజరై గ్రామ ప్రజలు, రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన భూభారతి రెవెన్యూ చట్టం 2025 గ్రామసభ ప్రతి గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మీ గ్రామంలోనే రెవెన్యూ అధికారులుంటారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనా రాయణ, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

● డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

తాంసి : భూభారతితో పురాతన సమస్యలకు పరిష్కారం కలుగుతుందని డీసీసీబీ చైర్మన్ అడ్డీ భోజారెడ్డి అన్నారు. భారతి సదస్సు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గిరిగావ్ గ్రామంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ ఎంతో ప్రతిష్టాత్మకంగా భూభారతి కార్యక్రమా నికి శ్రీకారం చుట్టిందని, ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వ మని రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభు త్వం అన్ని విధాలుగా సహాయమం దిస్తుం దన్నారు. ప్రతి రైతు తమ సమస్యను నేరుగా తహసిల్దార్ కార్యాలయానికి వెళ్ళకుండానే గ్రామంలోనే పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమాన్ని పక్కతోవ పట్టించే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు.

రెవెన్యూ సదస్సులో సమస్యలు పరిష్కరించుకోవాలి

ఇంద్రవెల్లి : గ్రామస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్ సూచించారు. మంగళవారం మండలంలోని ఏమైయికుంట, ధన్నోర్ (బీ) గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ, రిజిస్టార్లు, దరఖాస్తుదారులకు ఇస్తున్న రశీదు, ఏ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ రైతులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. వారి భూ సంబంధిత సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కార మార్గాల పై సూచనలు ఇచ్చారు. భూ భారతి కార్యక్రమం ద్వారా గ్రామాలకు రెవెన్యూ అధికారులు వెళ్లి భూమి సంబంధిత సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. భూ సమస్యలు ఉంటే సంబంధిత ఫారం నింపి అధికారులకు అందజేయాలని రైతులకు సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం అన్ని దరఖాస్తులు స్వీకరించేంత వరకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతుల భూ సమస్యలు వేగంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, ఫారాల స్వీకరణ నుండి ఆన్‌లైన్ నమోదు వరకు ప్రతి దశలో బాధ్యతతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో జరిగే భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్ రావు, మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బేలలో ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ రఘునాథ్ రావ్

బేల, జూన్ 03 (ఆంధ్ర జ్యోతి) : మండల కేంద్రంలో ఆధార్ సేవా కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ రఘునాథ్ రావ్ వ్యవసాయ అధికారి సాయి తేజా రెడ్డితో కలిసి ప్రారంభిం చారు. గతంలో ఆధార్ సేవా కేంద్రం లేక మండల వాసులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆధార్ కార్డులో చిరునామా మార్చాలన్న, పేరులో చిన్న తప్పు సవరించాలన్న, విద్యా సంస్థల్లో ప్రవేశం పొందాలన్న, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేయాలన్న ఆధార్ లేనిదే పని జరగడం లేదు. దీంతో మండల వాసులు ఆధార్ అప్‌డేట్ కోసం తమ పనులన్ని మానేసి జిల్లా కేంద్రానికి,పక్కనున్న మహారాష్ట్ర కు వెళ్లి అప్‌డేట్ చేసుకొనేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జనాల ఇబ్బందులు దృష్టిలో పెట్టి ఇక ముందు ఆధార్ కార్డు కోసం ఎవరు ఇబ్బందులకు గురికావొద్దనే ఉదేశంతో ఆధార్‌సేవా కేంద్రాలను మంజూరు చేసింది. ఈ సందర్భంగా తహసీల్దార్ రఘునాథ్ రావ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు జిల్లా కేంద్రాన్ని గాని మహారాష్ట్రకు వెళ్లే వారిని అన్నారు. ఇప్పుడు మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ సేవను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. ఇకనుంచి మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధితులు దళారులను నమ్మి మోసపోవద్దు



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న దృశ్యం

తలమడుగు , జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు ఇప్పిస్తామని ఎవరైనా దళారులు వచ్చి చెబితే వారిని నమ్మి మోసపోవద్దని మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం కొంత మంది పర్సెంటేజీలు తీసుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులకు వచ్చాక ప్రతిదీ ఆన్‌లైన్ ద్వారానే నిధులు విడుదల చేస్తున్నామన్నారు. అనంతరం మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన చింతలపేల్లీ సరిత అనారోగ్యంతో హాస్పిటల్ ట్రీట్మెంట్ చేసుకోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 60 వేల చెక్కుని ఇవ్వడం జరిగింది. సకీనాపూర్ గ్రామానికి చెందిన బత్తుల సూర్యప్రభ అనారోగ్యంతో హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ చేసుకోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 22,500 వేల రూపాయల చెక్కుని మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి అందజేశారు. మంత్రి సీతక్కకు, బోథ్ నియోజవర్గం కాంగ్రెస్ ఇంచార్జి అడే గజేందర్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వాడితేనే పంటల దిగుబడి



సబ్సిడీ విత్తనాల బస్తాలను అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్, సొసైటీ డైరెక్టర్లు

● ఏఎంసీ చైర్మన్

బోథ్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని, ఎంపిక చేసిన రైతులకు మేలురకం విత్తనాలు అందజేస్తున్నామని, అయితే రైతులు ఈ విత్తనాలను వాడి అధిక దిగుబడులు పొందాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజుయాదవ్‌లు పేర్కొన్నారు. మంగళవారం రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వపరంగా సరఫరా చేసిన విత్తనాలను రైతులకు అందించారు. రైతులు తొందరపడి విత్తనాలు నాటవద్దని భూమి 60 శాతం తడిసిన తర్వాతనే విత్తనాలు నాటాలన్నారు. లేకుంటే నష్టపోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలను పాటిం చాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు రవితేజ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.